క్లుప్తంగా

గ్రేడ్‌-1 కమిషనర్‌గా అంజయ్య



కమిషనర్‌ అంజయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయాల ఉద్యోగులు

నరసాపురం: గ్రేడ్‌-2 మున్సిపల్‌ కమిషనర్‌గా కొనసాగుతున్న నరసాపురం మున్సిపల్‌ కమిషనర్‌ ఎం.అంజయ్యను గ్రేడ్‌-1 కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు అందాయి. ఈ నేపథ్యంలో కమిషనర్‌ అంజయ్యను వార్డు సచివాయాల ఉద్యోగులు, సిబ్బంది కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసఫ్‌కిషోర్‌, మండల అధ్యక్షుడు మదన్‌, సీహెచ్‌ వి.జయసుధ, ఎన్‌ అశోక్‌నాయుడు, టీఏ రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న నన్నేటి పుష్పరాజు

నరసాపురం: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ నిధులను పక్కదారి పట్టించి దళిత కాలనీల్లో అభివృద్ధిని కుంటుపరుస్తుందని మాలమహానడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్‌ అన్నారు. మంగళవారం రుస్తుంబాధలో జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. సరైన విద్యుత్‌ సదుపాయాలు కూడా ఎక్కడా లేవన్నారు. సబ్‌ప్లాన్‌ నిధులు సవ్యంగా ఖర్చు పెడితే ఈ పరిస్థితి తలెత్తేది కాదని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కోలాటి వరప్రసాద్‌, వర్దనపు అజిత్‌, మానుకొండ వెంకటరాజు, దాసరి రాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం అర్బన్‌: గ్రామాలోల్ల నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సైకాలజిస్ట్‌ ఎస్‌కే రహీం అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో డాడీ ఫస్ట్‌ ఎయిడ్‌ క్లినిక్‌లో అభిరామ్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఈసీజీ, బీపీ, హోమియోగ్రామ్‌, ఆర్‌బీఎ, బీఎండీ లాంటి రూ.3500 విలువైన పరీక్షలను ఉచితంగా చేశారు. కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ బాల మురళీ కృష్ణ సుమారు 120 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ముగిసిన పల్లాలమ్మ జాతర

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలోని పల్లాలమ్మ అమ్మవారి జాత ర ముగింపు సందర్భంగా మంగళవారం అఖండ అన్నసమారాధన జరి గింది. గ్రామ వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు కతారి రామకృష్ణ(రాము) ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని వేలాది మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కతారి జయలక్ష్మి, కేశవరావు, పాతపాటి శ్రీనివాసరాజు, కతారి శ్రీకాంత్‌, కట్రెడ్డి మణికంఠ స్వామి, విద్యాసాగర్‌, పుచ్చకాయల బ్రహ్మాజీ, కట్రెడ్డి వెంకన్న, ఆంజనేయులు, గిరి పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో సెప్టిక్‌ ట్యాంక్‌ వ్యర్థాల డంపింగ్‌

భీమవరం అర్బన్‌: మండలంలోని నాగిడి పాలెం బ్రిడ్జిపై యనమదుర్రు డ్రెయిన్‌లోకి సెప్టిక్‌ ట్యాంకర్‌ ద్వారా మల మూత్ర విసర్జితాలను డంపింగ్‌ చేస్తున్నారు. దూర ప్రాంతానికి తీసుకెళ్లి డంప్‌ చేయాల్సి ఉండగా జనావాసాల మధ్య డంప్‌ చేయడంతో గ్రామస్తులు, మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులు ఆ డ్రెయిన్‌లోనే చేపల వేట సాగిస్తారు. చుట్టూ జాతీయ రహదారి మీదుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు, చుట్టు ప్రక్కల గ్రామస్తులకు దుర్వాసన రావడంతో డంప్‌ చేసేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు గ్రామంలో ఉన్న ప్రైవేట్‌ పాఠశాల మాజీ ప్రిన్సిపాల్‌ కృష్ణారావుపై ఇప్పటికే పలువురు ఫిర్యాదులు చేయగా, మంగళవారం మరొకరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భీమవరానికి చెందిన జవ్వాది రమేష్‌ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తన ఇద్దరు కుమారులను పాఠశాల లో చేర్పిన సందర్భంగా చెల్లించిన లక్షల రూపాయల ఫీజును ప్రిన్సిపాల్‌ పాఠశాలకు చెల్లించకుండా సొంతంగా వాడుకున్నాడని తెలిసిందన్నారు. స్కూల్‌కి వెళ్లి ఆరా తీయగా, ఇప్పుడాయన స్కూల్‌లో పని చేయ డం లేదని తెలిసిందని చెప్పారు. ప్రిన్సిపాల్‌ని నిలదీయగా, దురుసు గా ప్రవర్తించాడని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

చివరి దశకు వరి కోతలు

రైతులను భయపెట్టిన వాతావరణం



పెనుగొండలో రాశులమీద బరకాలు కప్పుకొని ధాన్యాన్ని రక్షించుకుంటున్న రైతన్నలు

పెనుగొండ: విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో రైతులు సాగు చివరిలో ఆందోళనకు గురవుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో కోతలు దాదాపుగా పూర్తి కావచ్చాయి. మరో వారం రోజులు దేవుడు కరుణిస్తే గట్టెక్కుతామంటూ రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పగటి పూట ఎండ, రాత్రి వేళల్లోనూ, సాయంత్రం వేళల్లోనూ చిరు జల్లులు పడుతుండడంతో రైతులు కలవర పడుతున్నారు. ఆచంట నియోజక వర్గంలో పెనుగొండ మండలంలో 11782 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12103 ఎకరాల్లోనూ ఆచంట మండలంలో 10600 ఎకరాల్లో , పోడూరుమండలంలో 12800 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆయా మండలాల్లో 90 శాతంకు పైగా కోతలు పూర్తి చేశారు.

వర్షంతో ఉరుకులు పరుగులు

ప్రస్తుతం అకాలంగా వర్షం పడుతుండడబంతో కోతలు పూర్తి చేసిన ధాన్యాన్ని త్వరగా ఒబ్బిడి చేసుకోవాలన్న తలంపుతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఈ తరుణంలో వారం రోజుల పాటు సంచుల కొరత రైతులను ఇబ్బందులకు గురి చేసింది. అదేవిదంగా పట్టుబడులు పట్టిన ధాన్యాన్ని మిల్లులకు చేర్చడానికి అష్ట కష్టాలు పడుతున్నారు. తీరా ఎగుమతులు చేసిన తరువాత వాహనాలపై నుంచి ధాన్యం బస్తాలను దింపుకోవడానికి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఏమాత్రం చినుకులు పడినా వాటిని రక్షించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. దీంతో ఆచితూచి పట్టుబడులు పడుతున్నారు. రైసుమిల్లుల వద్ద వాహనాలపై నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం ఇబ్బందికరంగా మారింది. దీంతో వాహన దారులు ఎక్కువసమయం రైసు మిల్లుల వద్దే కేటాయిస్తుండడంతో మిగిలిన రైతులకు వాహనాలు అందే పరిస్థితి లేకుండా పోతుంది. దీని వల్ల రైతులు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ధాన్యం రాశులను వర్షం నుంచి కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. అదే విధంగా తేమశాతం తగ్గించుకోవడానికి ఎండ బెట్టిన ధాన్యాన్ని తిరిగి రాశులు చేసి బరకాలు కప్పుకుని, రాత్రి వేళల్లో వాటి వద్దే నిద్ర చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో మరోవారం రోజుల పాటు దేవుడు కరుణించాలంటూ రైతులు కోరుకుంటున్నారు.



వడలిలో ధాన్యం రాశులు



చిన్నంవారి పాలెంలో హడావుడిగా పట్టుబడులు చేస్తున్న దృశ్యం



పెనుగొండలో రైసుమిల్లుల వద్ద భారులు తీరిన ధాన్యం వాహనాలు

దివ్యాంగులను ప్రోత్సహించాలి

భీమవరం: బడి వయసు కలిగిన దివ్యాంగ పిల్లలను గుర్తించి పాఠశాలలో పేర్లు నమోదు చేయించి వారిని ప్రోత్సహించాలని సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌ పి.శ్యాంసుందర్‌ చెప్పారు. మంగళవారం భీమవరం పట్టణంలోని సమగ్ర శిక్షా కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల గుర్తింపు, ఎన్‌రోల్‌మెంట్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్‌ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా భవిత కేంద్రంలో దివ్యాంగులకు కల్పిస్తున్న సదుపాయాలను కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జూన్‌ 9వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వేను ఉపాధ్యాయులు నిర్వహిస్తారన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం పరీక్షలు, ఉద్యోగాల్లో రాయితీలు కల్పించడమే గాక సమగ్ర శిక్ష ద్వారా అవసరమైన దివ్యాంగుల పిల్లలకు ఉచిత ఉపకరణాలు అందిస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతోపాటు స్పీచ్‌ థెరపీ, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందిస్తున్నారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని శ్యాంసుందర్‌ చెప్పారు. కార్యక్రమంలో సాహితి విద్య సమన్వయకర్త సీహెచ్‌ సుబ్రమణ్యం, టి.శ్రీనివాసరావు, వై.పెద్దిరాజు, జగదీష్‌ పాల్గొన్నారు.

యువత జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలి



పెనుమర్రులో పోస్టర్‌ ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ మహ్మద్‌ హసీనా



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్‌ అధికారిణి ఇందిర

యలమంచిలి: యుక్త వయస్సులో ఉన్న యువతులు ప్రలోభాలు, ఆకర్షణలకు గురి కాకుండా జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ మహ్మద్‌ హసీనా కోరారు. కిశోర వికాసం సమ్మర్‌ స్పెషల్‌ క్యాంపు సోమవారం పెనుమర్రు గ్రామ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాధారణంగా ఈ వయస్సులో మోహాలకు గురికావడం సహజమన్నారు. ఎవరైతే వాటి నుంచి బయటకు వచ్చి చదువుపై దృష్టి సారిస్తారో వారు మాత్రమే జీవితంలో పైకి ఎదుగుతారన్నారు. అందువల్ల యువత అందరూ బాగా చదువుకోవాలని ఆమె కోరారు. అనంతరం ఆమె బాల్య వివాహం చేసుకోవడం వలన కలిగే అనర్థాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు చేస్తే విధించే శిక్షలు గురించి హసీనా వివరించారు. కార్యక్రమంలో పెనుమర్రు ఎంపీటీసీ సభ్యురాలు కవురు నాగలక్ష్మి, ఎంఎస్‌కే రామేశ్వరపు సీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాకా పద్మాదేవి, ఇంజేటి రాజేశ్వరి, ఏఎన్‌ఎం రాపాక ప్రేమకుమారి, ఆశ కార్యకర్తలు కవురు దుర్గాకుమారి, కొడమంచిలి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్‌: బాలికలు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ఐసీడీఎస్‌ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్‌ ఇందిరా సూచించారు. మంగళవారం స్థానిక బ్రాడీపేట సచివాలయం వద్ద ఐసీడీఎస్‌ ప్రాజెక్టు పరిధిలో కిశోర్‌ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా మాట్లాడుతూ పోక్సో చట్టంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. నేత్రాలయం ఆధ్వర్యంలో కిశోర బాలికలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కిశోర బాలికలకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఎస్సె రైటింగ్‌ పోటీలు, డ్రాయింగ్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాలికలకు సచివాలయం అడ్మిన్‌ బండి దుర్గాప్రసాద్‌ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ పులఖండం సత్యవేణి, ఎంఎస్‌కే శ్రీదేవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



ఆర్డీఓ కార్యాలయ ఏఓకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు సాగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు డిమాండ్‌ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులు నివారించాలని కోరుతూ మంగళవారం నరసాపురం సబ్‌కలెక్టర్‌ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ మిల్లర్స్‌ టార్గెట్స్‌ పూర్తయ్యాయని చెప్పి, రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితికి వెళ్లిపోతున్నారన్నారు. అకాల వర్షాలతో తేమశాతం పెరిగి రైతులు ఇప్పటికే నష్టపోయారన్నారు. టార్గెట్లు, తేమ శాతాలతో సంబంధం లేకుండా రైతుల వద్ద ఉన్న ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్‌ కార్యాలయ ఏఓ పెద్దిరాజుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, తెలగంశెట్టి సత్యనారాయణ, గుత్తుల శ్రీరామచంద్రుడు, కవురు శ్రీనివాస్‌, దిడ్ల నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



చిట్టవరంలో ఆగ్రోఫీడ్‌ ఫ్యాక్టరీ కార్మికులతో మాట్లాడుతున్న ముచ్చర్ల త్రిమూర్తులు

నరసాపురం రూరల్‌: మే 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగ కార్మిక వర్గంలో విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం చిట్టవరం . మండలంలోని చిట్టవరం గ్రామంలో భారత్‌ లుక్సీ నడొ ఆగ్రో ఫీడ్‌ ఫ్యాక్టరీ వద్ద కార్మికులతో గేట్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ కార్మికుల హక్కులను హరించి వేస్తున్నాయన్నారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్‌ ప్రభుత్వంతో భారత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 40 రకాల కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్‌ కోడ్స్‌గా చేసి కార్మిక హక్కులను నీరుగారుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్‌ కోడ్స్‌ ను తక్షణం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడి లక్ష్మణ్‌, కొరాడి బద్రి, హరి గంగాధర్‌, పెద్దిరాజు, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సౌందర్య లహరి శ్లోకాల తర్ఫీదు

- శ్లోకాల్లో శిక్షణ ఇస్తున్న సనాతన భక్త మండలి నిర్వాహకురాలు
- 45 రోజులు పాటు 100 చిన్నారులకు శిక్షణ



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ గోశాల వద్ద చిన్నారులకు శ్లోకాలను నేర్పుతున్న భాగ్యలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్‌: విద్యార్థులు ఇప్పటి వరకూ చదువుకే ప్రాధాన్యతనిచ్చారు. పరీక్షలు రాశబురారు. ఫలితాలు వచ్చాయి. తదనంతరం ఏమి ప్లాన్‌ చేసుకోవాలో చేసుకునే పనిలో కొందరు విద్యార్థులు ఉన్నారు. మరి కొందరు విద్యార్థులు ప్రస్తుతం వేసవి సెలవులతో సరదాగా గడపాలనే ఆలోచనల్లో ఉన్నారు. ఇందులో కొందరు విద్యార్థులు ఆటలు,పాటలు లేదంటే బంధువుల ఇంటికి వెళ్లాలంటూ టూర్‌ ప్లాన్‌లు చేసుకుంటుంటారు. కొందరు విద్యార్థులు మాత్రం ఆధ్యాత్మిక పరమైన శ్లోకాలు నేర్చుకోవడనికి ప్రాధాన్యతనిస్తున్నారు. పాలకొల్లు పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గోశాల ప్రాంగణంలో శ్రీవిద్య ఉపాశకురాలు, సనాతన భక్త మండలి నిర్వాహకురాలు డాక్టర్‌ నంబూరి భాగ్యలక్ష్మి సుమారు ఓ వంద మంది చిన్నారులకు సౌందర్యలహరి శంకరాచార్య విరచిత శ్రీ విద్యా గ్రంథం శ్లోకాలను నేర్పుతున్నారు. ఈ శ్లోకాలు రెండు బాగాలుగా ఉంటాయి. ఆనందలహరిలో 41, సౌందర్యలహరిలో 59 మొత్తం వంద శ్లోకాలను వాటి తాత్పర్యంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ శ్లోకాలను అమ్మవారు శంకరాచార్యునికి స్వయముగా అందించినట్లు చెబుతారు.

ఉద్యోగాన్ని వదిలి మరీ

నిర్వాహకురాలు భాగ్యలక్ష్మి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఫార్మసీ కళాశాలలో వైద్యురాలిగా పని చేస్తూ రూ. 1.20 లక్షల జీతాన్ని వదులుకుని పది మందిలో ఆధ్యాత్మిక చింతన పెంచాలనే సంకల్పంతో పాలకొల్లు స్వగ్రామానికి వచ్చేశారు. అప్పటి నుంచి చిన్నారులకు, మహిళలకు శ్లోకాలు తర్ఫీదుతో పాటు కోలాటం, దాండియా వంటి వాటిలో శిక్షణ ఇస్తుంటారు. దాదాపుగా తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నా ఆ కార్యక్రమంలో అమ్మవారి శ్రీచక్రం ఏర్పాటు చేయాలంటే భాగ్యలక్ష్మి వెళ్లి ఏర్పాటు చేస్తుంటారు.

రెండేళ్లుగా శిక్షణ



గత రెండేళ్లుగా వేసవి సెలవుల్లో చిన్నారులకు, మహిళలకు సౌందర్యలహరి శ్లోకాలు, లలితా సహస్రనామ శ్లోకాల్లో శిక్షణ ఇస్తుంటారు. మంగళవారం, శుక్రవారాల్లో దాండియా నేర్పుతుంటాను. శ్లోకాల శిక్షణకు పట్టణంతో పాటు మేడపాడు, అరట్లకట్ట, కొంతేరు ఇలా చుట్టుపక్కల గ్రామాల నుంచి వస్తుంటారు. సరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థులకు కర్రసాము, లలిత సహస్రనామాల్లో శిక్షణ ఇస్తుంటాను.

– డాక్టర్‌ నంబూరి భాగ్యలక్ష్మి, సనాతన భక్త మండలి నిర్వాహకురాలు

ఆధ్యాత్మిక సేవతో సంతృప్తి



ఆధ్యాత్మికంగా భగవంతునికి సేవ చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది. భాగ్యలక్ష్మి ఇస్తున్న శ్లోకాల శిక్షణతో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి సేవ చేసే అదృష్టం కూడా కలుగుతుంది. దాండియా గాని, శ్లోకాలు గాని నేర్చుకుంటుంటాం. దానివల్ల ఆలయంలో జరిగే ఏ ఉత్సవంలోనైనా పాల్గొనే అవకాశం కలుగుతుంది. శ్లోకాలు నేర్చుకుంటుంటే మనసు చాలా ప్రశాంతంగా అనిపిస్తుంది.

– కొప్పు శివజ్యోతి, పాలకొల్లు

శ్లోకాలు కంఠస్థం చేయడమే లక్ష్యం



సెలవుల్లో ఆటలాడుకుందామని అనుకున్నాము. మా అమ్మా నాన్న ఆలయంలో శ్లోకాలు చెబుతున్నారు నేర్చుకోమని పంపిస్తున్నారు. ఇక్కడ ఇంత మంది స్నేహితులతో కలిసి నేర్చుకోవడం చాలా బాగుంది. మాకు కొన్ని శ్లోకాలు కంఠస్థం వచ్చాయి. సెలవులు పూర్తయ్యే లోపు మిగిలిన శ్లోకాలు కంఠస్థ పట్టాలని మా చెల్లి నేను పట్టుదలతో నేర్చుకుంటున్నాం.

– బి.దుష్యంత్‌ ఐదో తరగతి, బి.జాహ్నవి ఒకటో తరగతి

గడ్డివాము దగ్ధం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పదెకరాల గడ్డివాము దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే విస్సాకోడేరు గ్రామానికి చెందిన రైతు బండారు సత్యనారాయణ పశుగ్రాసం నిమిత్తం పదెకరాల ఎండు గడ్డిని నిల్వ చేసుకోగా ప్రమాదవశాత్తు ఆ గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగబడ్డాయి. స్థానికులు భీమవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఏడీఎఫ్‌ఓ సూర్య ప్రకాశం నేతృత్వంలో సుమారు గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్ని ప్రమాదం వలన సుమారు 50 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు ఏడీఎఫ్‌ఓ సూర్య ప్రకాశం తెలిపారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది →



సరస్వతీ నది పుష్కర యాత్రకు ప్రత్యేక బస్సు

నరసాపురం: సరస్వతీ నది పుష్కరాలను పురస్కరించకుని కాళేశ్వరం త్రివేణి సంగమ యాత్రకు నరసాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌ ఎస్‌.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 23 వరకు ప్రత్యేక బస్సు నడపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భద్రాచలం, మల్లూరు, మేడారం , కాళేశ్వరం, ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి పుణ్య క్షేత్రాలను తిప్పుకుని బస్సు వస్తుందని స్పష్టం చేశారు. చార్జీ రూ.3,900గా నిర్ణయించామని వివరించారు. 30 మంది ప్రయాణికులు ఉంటే వారు ఉన్న ప్రదేశానికి బస్సు పంపుతామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు డిపో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆర్థికంగా బలహీనంగా ఉన్న కాపులకు న్యాయం చేయాలి



విజయ రంగారావు

నరసాపురం రూరల్‌: ఆర్థికంగా బలహీన పడిన కాపులకు కూటమి సర్కారు న్యాయం చేయాలని నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్‌, నరసాపురం మండలం కాపు సంఘ మాజీ అధ్యక్షులు కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో రాష్ట్రంలో అధిక శాతం కాపు సామాజిక వర్గం కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిందన్నారు. బలహీన వర్గానికి చెందిన కాపులకు ప్రత్యేక రిజర్వేషన్‌ కల్పించాలని, 50 సంవత్సరాలు దాటిన వారికి వద్ధాప్య పింఛను కల్పించాలని, చదువుకునే కాపు విద్యార్థులకు ఆర్థిక సహాయం కల్పించాలని, చిరు వ్యాపారస్తులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు.

అనారోగ్య బాధితులకు సాయం



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న దాత రవిశంకర్‌, వరలక్ష్మి దంపతులు

పాలకొల్లు సెంట్రల్‌: సేవా కార్యక్రమాలు ద్వారా పది మందికి సహాయపడడంలో ఉన్న ఆనందం ఎందులోనూ లేదని కొరగింజల రవిశంకర్‌ అన్నారు. మంగళవారం స్థానిక 21వ వార్డు వెలమగూడెంలో శ్రీరాములు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు రవిశంకర్‌, వరలక్ష్మి (మాజీ కౌన్సిలర్‌) దంపతులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌ మాట్లాడుతూ నలుగురు మెరిట్‌ విద్యార్థులకు సైకిళ్లు, 20వ వార్డులో ఇటీవల ప్రమాదవశాత్తూ కాలువలో పడి చనిపోయిన కొండపల్లి రామారావు కుటుంబ సభ్యులకు రూ. 30 వేలు, బోణం నాగలక్ష్మి వాళ్ల అమ్మాయి వివాహం నిమిత్తం రూ. 10 వేలు, అనారోగ్యంతో బాదపడుతున్న తిరుమరెడ్డి మణి వైద్య సదుపాయం నిమిత్తం రూ. 10 వేలు, వాసం లక్ష్మీ కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు నగదు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగ సత్యనారాయణ, జోగి నాగేశ్వరరావు, అచ్చం రామలింగయ్య, ఇంటి క్రాంతి, కట్ట సరస్వతి, కత్తుల విజయలక్ష్మి, కె.కుమారి, పోలాకి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందన

భీమవరం (ప్రకాశంచౌక్‌): రెడ్‌ క్రాస్‌ సంస్థకు అత్యుత్తమ సేవలు అందించి ఇటీవల గోల్డ్‌ మెడల్‌ పొందినందుకు గాను కలెక్టర్‌ నాగరాణిని కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ మంగళవారం అభినందించారు.